తగిన వరుడు కోసం తగినకట్నం ఇవ్వాలి;
తగినకట్నం ఇవ్వడానికి తాహతు చాలనప్పుడు

# ఏం చెయ్యడం··?

'కట్నపుసొమ్ము కాలకూటవిషం...వరవిక్రయం నరమాంసవిక్రయం...'
'తెలిసివున్న తప్పే' ఇది సంఘానికి...
ఈ పొరపాటు అలవాటై పోవడంవల్ల సంసారాలు క్రుంగిపోతున్నాయి; నిస్పృహా, దైన్యంతో అల్లాడిపోతున్నాయి.
ఇకనైనా సంఘం ఆత్మపరీక్ష చేసుకుంటుందా?

శ్రీమతి
పులిపాక బాలాత్రిపుర సుందరమ్మగారు

"సీతా! యేంచేస్తున్నావు?" అన్నాడు రామారావు నిద్రలేచివచ్చి క్రింది హాల్లో కుర్చీలో కూర్చుని. 'కాఫీ తీసుకువస్తున్నాను' అని కాఫికెటిలు, కప్పు సాసరుతో సహా వచ్చి రామారావుదగ్గిర బల్లమీద పెట్టి అక్కడేఉన్న కుర్చీని దగ్గిరగాలాక్కుని తానుకూడా కూర్చుని కాఫీ చల్లార్చియిస్తూ,

'మీరువెళ్లిన పనులేమైనా అయినాయా?' అన్నది సీత నెమ్మదిగా.

'వెళ్లంగానే కావటానికి ఇవ్వేం బజారువస్తువులా? ఆఫీసుపనులా? ఒకరూపాయి ఇచ్చేచోట ఇంకొకరూపాయిఇస్తె పూర్తికావటానికి? చేసుకురావటానికినీ? ఇది అల్లుడితో సంబంధించినపని. తిరిగితిరిగి వేసారిపోయాను. కాని మనకందుబాట్లో వున్నది ఒక్కటీ నాక్కనపడలేదు యేంచెయ్యను? యింకా కొన్నిచోట్లు ఉన్నాయంటే నా స్నేహితులిద్దరితో చెప్పవచ్చాను మనకందుబాటులోగల సంబంధమును వ్రాయమని. అయినా మీ రాధాకృష్ణయ్యగారి కొడుక్కు చేసుగుంటారేమొ కనుక్కుందామా?' అన్నాడు రామారావు.

'యెందుకు చేసుకుంటారు? ఆయన జిల్లాజడ్జీ చేస్తున్నాడు. పిల్లవాడు ఐ. సి. యస్. చదువుతున్నాడు. మనమిచ్చె కొద్ది కట్నానికి వాళ్లుమాత్రం చేసుగుంటారూ?' అన్నది సీత విస్తుపోతూ.

'నీకు దగ్గిరబంధువుగదా? చేసుగోకూడదూ? ఆయనకున్నడబ్బు చాలక యింకా పిల్లవాడిమీద డబ్బు తీసుకోవాలా?'

'యిప్పుడడిగేవాళ్లంతా డబ్బులేనివాళ్లా? యెక్కువడబ్బున్నవాళ్లే యెక్కువ డబ్బడుగుతారు.'
'చుట్టరికమన్నా చూస్తాడేమొ అడిగిచూద్దాం.'
'అడిగి కాదనిపించుకోటమే గాని వాళ్లెందుకు చేసుకుంటారు?'
'అయినా అడిగిచూస్తే దారియెల్లావస్తుందో.'

‘ మనకు తెలిసినదారికి యింతఆలోచనెందుకు? మా తమ్ముడికియ్యరాదు? చిన్నవాడు చదువుకుంటున్నాడు, కట్నంలేకుండా చేసుకుంటాడు.’

‘ ఆమాట నాముందు తలపెట్టవద్దు. ఏమున్నదనియ్యమంటావు నీ తమ్ముడికి? ఆస్తీ అంతా మీ అన్నగారే పూర్తిచేశాడు. వీడేంతింటాడు? మనమ్మాయివెళ్లి యేంతింటుంది? చచ్చు స్కూలుఫైనలు వాడికి యెల్లాయివ్వను?’

‘ యిప్పుడేకదా చుట్టరికమన్నా చూడకూడదా అన్నారు. నాకు నాతమ్ముడు పరాయివాడా?’

‘ అయితేమాత్రం చూస్తూ చూస్తూ గొంతుకోయమంటావా?’ మీ భాగ్యవంతుల అన్నకొడుక్కు చేసుకోనూవద్దు, నీతమ్ముడు శుద్ధమొద్దుకు శేనివ్వనూ వొద్దు, అని రివ్వునలేచి క్లబ్బుకెళ్లాడు రామారావు. సీతలేచి యింటిపనుల్లో నిమగ్నురాలైంది.

... ... ...

సీతారామారావులది చాలా అనుకూలదాంపత్యం. సీత పుట్టింటివారిని ఏమన్నాఅంటేమాత్రం కొంచకోపం వస్తుంది సీతకు. అందుకని కదిలించి ఏదయినా ఒకమాట అని తమాషా చూస్తూవుంటాడు రామారావు. రామారావు తెలివికలవాడు, బుద్ధిమంతుడు. ఇతనికి చిన్నతనంలోనే తండ్రిచనిపోయినప్పటికి తల్లి చెప్పుచేతల్లోవుండి పెద్దచదువు చదువుకొని ఉద్యోగంచేస్తున్నాడు. ఇప్పటికీ తల్లిమాట జవదాటడు. భార్యనుకూడా చాలా అనురాగంగా చూస్తాడు.

నెలకు నాలుగువందలు సంపాదించుకొంటున్నాడు. పిత్రార్జితపు ఆస్తిమీదకూడా కొంచెం ఆదాయం వస్తుంది. అయినప్పటికీ యిప్పుడు పెండ్లిఈడు వచ్చినదే పెద్దపిల్ల. యింకా యిద్దరు ఆడపిల్లలు యిద్దరుమగపిల్లలు చిన్నవాళ్లున్నారు. ఎక్కడన్నా కొంచెం అన్నవస్త్రాలకి లోపంలేకుండా చదువుకుంటున్న కుర్రవాడికిచ్చి పెండ్లిచేయాలని ఉన్నది రామారావుకు. తాను కోరే సంబంధము తన ఆస్తిఅంతా యిచ్చినా వచ్చేటట్లులేదు. తనకు తెలిసిన ఊళ్లువెళ్లి ఆలోచిస్తున్నాడు. యెక్కడా నచ్చటములేదు. నచ్చినచోట కుదరటములేదు. క్లబ్బుకువెళ్లినా తోచక ఆరున్నరకే యింటికొచ్చాడు రామారావు. రామారావు తల్లి పూర్వాచారపరాయణురాలు. మనుమరాలిపెండ్లి చేయలేదనీ పెద్దదైతే కులంలో వెలైపోతామనీ, వంశములో అమర్యాదవస్తుందనీ కొడుకును రోజూ తొందరపెడుతూవున్నది. క్లబ్బునుంచివచ్చి ఒంకెనకు కండువా తగిలిస్తున్నాడు రామారావు.

దక్షిణపుదొడ్లో పువ్వులచెట్లక్రింద ఉన్నరాతి తిన్నెమీద రామారావుతల్లి మనుమలను మనుమరాండ్రను కూర్చోపెట్టుకుని వెన్నెలలో ఆడిస్తూ, వాళ్లకు పిచ్చుకమ్మ కాకమ్మకథలుచెపుతూ ఆనందిస్తూన్నది. రామారావు మామూలుప్రకారం దక్షిణపుదొడ్లోకివెళ్లి తల్లిదగ్గర కూర్చున్నాడు. కుమారునిచూచి మెల్లిగా అతను ఈ పదిరోజులుగా సంబంధాల విషయంలో తిరిగిన భోగట్టా అంత అడిగింది. రామారావుతల్లికి అంతా చెప్పాడు. సంబంధాలు ఎక్కడా కుదరకపోవడంనుంచి, కళ్లవెంట నీళ్లెట్టుకుంటూ, తాను బ్రతికివుండగా మనమరాలిపెళ్లి చూడడం నోచుకోలేదేమోనని, కొడుకు ఆవిషయంలో తగినంత శ్రద్ధగా పనిచేయటంలేదనీ రామారావును వేధించింది. రామారావు తిరిగితిరిగివచ్చి ప్రాణం విసిగిపోయివున్నాడు. ఇంటికివచ్చేసరికి తల్లిపోరు అతన్ని మరీబాధపెట్టింది. అంచేత కొంచెం కోపంగా సమాధానం చెప్పాడు తల్లికి. ఈ కేకలువిని, మేడమీద పడుకుని ‘గృహలక్ష్మి’ చదువుకుంటున్న సీత చప్పున దిగివచ్చి అన్నది,

# ఏం చెయ్యడం...?

'ఏమిటి యివ్వాళ అత్తగారితో కోపంగా మాట్లాడుతున్నారు? పూర్వాచారం ప్రకారం చప్పున పెండ్లిచేస్తే కులధర్మముగా ఉంటుందనీ, పెద్దది గనుక ఎప్పుడు చచ్చిపోతానో చూద్దామనీ అంటారు గాని ఆమెకుమాత్రం అమ్మాయి సుఖపడాలని ఉండదా?'

'నాకుమాత్రం ఆమెయందు భక్తిలేదా? ఈ విషయములో నన్ను ఎక్కువగా కదిలిస్తే కోపం వస్తున్నది, నా మనస్సు చాలా చీకాకుగా ఉన్నది.'

'సరే లేవండి. యివ్వాళ వెంకమ్మగారు ఉల్లిపాయ పప్పుపులుసు, దొండకాయకూరా చేశింది. అవి తింటే చీకాకు పోతుంది.' అని చిన్న నవ్వు నవ్వింది సీత.

'చాల్లే నీమాటలు నువ్వూను, నేనిప్పుడు లేవను' అని కూర్చున్నవాడల్లా పడుకున్నాడు తిన్నెమీద

'పాపం హరికథకెళుతుందిట వెంకమ్మగారు. లేవండి, ఎప్పుడు అడగదు యివ్వాళ ఏకాదశి అని వెళతానన్నది. అంచేత వంట చప్పున ముగించుకుని కనిపెట్టుకుని కూర్చుంది.'

'అయితే లేస్తా తువ్వాలియ్యి' అని లేచాడు రామారావు. అందరు లేచి యింట్లోకెళ్లారు.

... ... ...

ఉదయం తొమ్మిదిగంటలైంది. కాఫీత్రాగి హాల్లో వాలుకుర్చీలో పడుకుని పైకిచూస్తూ ఆలోచిస్తున్నాడు రామారావు. ఇంతలో పోష్టుబంట్రోతు వచ్చి, ఒక కవరు రెండు కార్డులు యిచ్చి వెళ్లాడు. అవి చూచేసరికి ప్రాణం లేచివచ్చినట్లు చప్పున అందుకుని చూచాడు. ఒక కార్డు అత్తవారి ఊరునుంచి వచ్చింది; పిల్లకు సంబంధం కుదిరిందా? లగ్నాలు పెట్టుకున్నారా? అని. రెండవది ఒదినెగారి కొమార్తెకు పెండ్లనీ, వచ్చే మనుష్యులులేక శుభలేఖ వ్రాశామని తప్పక అందరూ రావలసిందనీ వచ్చాయి. పోష్టుబంట్రోతు ఉత్తరములు యివ్వడం చూచింది సీత. తానుకూడా వచ్చి అక్కడే కూర్చున్నది గోడకు చేరబడి ఏంచదువు తారో విందామని. ఆ కార్డులు రెండూ విసిరి ఆమెమీద పడేసి, కవరువిప్పాడు రామారావు. దానిలో సంగతులు ఈవిధంగా ఉన్నాయి....

"నీవు చెప్పినప్రకారం ఆలోచించినాను. వంగోలులో మాడపాటివారి సంబంధం ఉన్నది. వారి బేరం మాగాణి తప్ప డబ్బు అవుసరములేదట. ఆ బేరం మనకు కుదిరేటట్లులేదు. మామిడాలవారి కట్నమంతా బంగారం తూచి యివ్వవలెనట, వెండిరూపాయలు వారికి అచ్చిరావట. పిల్లవాడు నీపొడుగు ఉంటాడు. యల్. యం. పీ. చదువుతున్నాడు. [illegible]ంతల బట్టలు వారికీ, వారితోవచ్చిన చాకలివాడితో సహా అందరికి పట్టువి తప్ప నూలువి ముట్టుకోరట. ఆస్తి ఏమిలేదు. ఈ షరతులు నీకు యిష్టమైతే అభ్యంతరములేకుండా వప్పుకుంటారు. అద్దంకిలో ఒక సంబంధం ఉన్నది. బేరంచేశాను. ఒకటి తొమ్మిదివేలకు తగ్గరట బాగా భూస్థితి ఉన్నది. స్కూలుఫైనలు తప్పి, ఈ సంవత్సరం కరిణీకపు లెక్కలు నేర్చుకుంటున్నాడు. ఒక్కడే పిల్లవాడు, ఇతని మేనమామ కరణమట, ఆయనకు బిడ్డలు లేనందున ఆయన తదనంతర కరిణీకం ఇతనికి వచ్చేటట్లు ప్రయత్నము చేస్తారట. యిది వారి స్థితి. తొమ్మిదివేలకు ఒప్పుకుంటే మీ కర్చులతో వచ్చి పెండ్లి చేసుకుంటారుట, కనుక తెలియబరచాను. మీ కష్టసుఖాలు మీరాలోచించుకుని ఏదో వొక నిర్ణయానికి వస్తారని తలుస్తాను. క్షేమం తెలియపరుచు."

రామారావు ఒక్కదీర్ఘ నిశ్వాసవిడిచి,

'సీతా! వింటున్నావుకదా? కాలపరిస్థితులు. ఈ కట్నాల సంస్కారం మీ ఆడవాళ్లల్లో కలగాలి, గాని మగవాళ్లేంచేస్తారు?' అన్నాడు రామారావు.

'ఆడవాళ్లేంచేస్తారు? సంస్కారం?'

‘ఆడవాళ్లవల్ల కలిగిన కట్నముల దురాచారము ఆడవాళ్లే సంస్కారంచెయ్యాలి.’

‘ఆడవాళ్లేం చేశారు కట్నముల కోసము.?’

‘చేసేదంతా ఆడవాళ్లే. మనబ్బాయికి యెంతకట్నమిస్తే మనకంత గొప్పనీ; కట్నంకొద్దీ వియ్యపురాళ్లను, ఆడపడుచులను అంతపెద్ద పీటలువేసి గౌరవిస్తారనీ దురాశ మీకు. మాదేముంది? ఉంటే పట్టుగుడ్డ, లేకపోతే కొల్లాయి మేము సిద్ధం. మీమాదిరిగా నగలు చీరలు కట్టుకుని ఒకచోట నుంచోటము, ఒకరువచ్చి తీసికెళ్లి పెద్దపీటలు వెయ్యటము, ఆ వేసిన పీటకు ఏ వంకరన్నా ఉంటే అలిగిరావడము, ఏమున్నది మాకు? ఏ పందిట్లోనో రెండు మెతుకులు తినివస్తాం’ అంటూ కుర్చీలోంచి లేచాడు రామారావు.

ఆ వుత్తరాలు అతనికంత నిరాశ కలగజేస్తాయని అనుకోలేదు. ఈకట్నాల దురాశ స్త్రీ పురుష భేదంలేకుండా, విద్యావిహీనుల్లోనే కాక విద్యావంతుల్లోకూడా బాగా ఘనీభవించి వుండడాన్ని చూస్తే అతనికి ఏంచెయ్యాలో అర్థమైందికాదు. అలా అర్థంలేకుండా చావిట్లో ఏదో ఆలోచిస్తూ పచారీలు చేస్తూనే వున్నాడు. మధ్యమధ్య ‘ఇప్పుడేంచెయ్యాలి...’ అని అనుకుంటూ. సీత ఏవేవోచెబుతోంది గాని ఆమాటలు అతనిచెవిలో పడటంలేదు. పచారీచేస్తూ గదిలోకివెళ్లి పైమీద కండువావేసుకొని ఎక్కడికో వెళ్లిపోయాడు రామారావు. సీత ‘రామచంద్రా! ఇప్పుడేంచెయ్యడం? ఈసమస్య పరిష్కారం కావడానికి ఏవైనా దారి వుందా...’ అని వేడినిట్టూర్పు విడుస్తూ గదిలోకి వెళ్లింది ఎంతో దీనంగా అడుగు లేస్తూ...

## నాడు - నేడు

పగర చెండాడగా పసిబాలచంద్రుని ఆహవరంగాని కనిపినావు
తిరిగి వచ్చిన తిక్కద్విజవీరు పురిగొల్పి పరిపంథి హతమార్ప బంపినావు
పెండ్లిపీటలనున్న వెంగళరాయుని రణరంగమునకు మరల్చినావు
శాసనోల్లంఘున సమరమ్మునకు నెందరెందరనో వెడలించినావు
ఆంధ్ర వీరత్వమెల్లెడ నలముకొనగ మునిగిపోనున్న స్వాతంత్ర్యమునకు నాడు
వలదు యుద్ధాలు వలదు, పోవలదటంచు బోధసేయుము స్వాతంత్ర్యమునకై నేడు.

బాసల కాసజెంది మును భారతయోధులు నుగ్గునూచగా
గోసిరి శత్రుశీర్షము లకుంఠితదీక్ష స్వతంత్రసిద్ధికై
మోసముజెంది నాడు; మరి పోలదటంచును నేడు శాంతిసిం
హాసనమెక్కి చాటుము సహాయ నిరాకరణమ్ము సోదరీ!

నలువదికోట్ల భారతజనమ్ము స్వతంత్రముగోరి కట్టెదె
బ్బలకు తుపాకిగుండ్లకును బాల్పడిరక్కట నాడు, నేడు నా
బలగమె వైరివీరుల తుపాకులకుం దలలొగ్గి నిల్చుటే
వలసిన కార్యమంచు మనపాలకవర్గము గోరు సోదరీ!

—శ్రీ చిపురుల ఆదినారాయణ.